ప్రజాశక్తి

ఆదివారం 25 ఆగస్టు 2024

5

అల్లూరి సీతారామరాజు



ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఆదివాసి గిరిజన సంఘం అరకులోయ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా గెమ్మెలి చిన్నబాబు, గత్తుం బుజ్జిబాబు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, అరకువేలి మండలంలోని 262 గ్రామాల్లో ఆదీసీల సమస్యలు గుర్తించి పరిష్కారం కోసం పోరాటం నిర్వహిస్తామన్నారు. పోడు భూమి పట్టాలు, హౌసింగ్, మంచినీటి సమస్య డ్వాక్రా మహిళల సమస్యలపై సమావేశంలో చర్చించామని భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు ఉదృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులు చిన్నబాబు, బుజ్జిబాబు

ఫార్మా ప్రమాద బాధితుల పట్ల..

ఇలాగేనా వ్యవహరించేది ?

-క్షతగాత్రులను బస్సుల్లో తరలిస్తారా .. సరైన అంబులెన్స్‌లే లేవా ?
-ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయండి
-జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో ఛైర్‌పర్సన్ సుభద్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సుభద్ర



సమావేశంలో మాట్లాడుతున్న అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనలో బాధితులకు సరైన అంబులెన్సు సదుపాయం లేక బస్సుల్లో తరలించడం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. పరిశ్రమలు ఉన్నచోట్ల ప్రభుత్వం, యాజమాన్యంతో మాట్లాడి ఆసుపత్రులు, అంబులెన్సుల సదుపాయం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. కోటవురట్ల మండలం కైలాసపురం సంఘటన, ఎసెన్షియా ఫార్మా ఘటన సమయంలో బాధితుల పట్ల వైద్యుల చూపిన తీరు ప్రశంసనీయమని ఆమె కితాబిచ్చారు. ఆమె అధ్యక్షతన జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగాయి. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు వేయగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ గిరిజన ప్రాంతంలో చేయూత పథకం కొందరికి అందలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలాగే గృహ నిర్మాణాలకు చెందిన బిల్లులు చెల్లించలేదని, ఇదివరకే దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొత్త గృహాలు మంజూరు కాలేదని కూడా ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేయాలని సంబంధిత అధికారులను కోరారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహ పథకాలు కొనసాగుతాయని, పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులు ఇకపైనా తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని అధికారులు ఛైర్‌పర్సన్‌కు వివరించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులపై ఆరా తీసిన ఆమె జెడ్‌పిటిసిలకు సమాచారం ఇవ్వాలన్నారు. దీనికి అధికారులు బదులిస్తూ ప్రతి గ్రామ సభలో తీర్మానం చేసిన పనులు తప్పక మంజూరవుతాయని, అలాగే గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందజేయడం జరుగుతుందని అన్నారు. అసంపూర్తిగా వున్న అంగన్వాడీ భవనాలు పూర్తయ్యేలా చూడాలని, మరమ్మతులు చేపట్టవలసిన భవనాలను నిర్లక్ష్యం చేయరాదని సంబంధిత అధికారులను సుభద్ర ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో సిల్వర్ ఓక్‌తో పాటు వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని, కాఫీతో పాటు జీడి, మిరియాల పంటలు పండించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో 5వ స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్ ఈర్లె అనూరాధ, జిల్లా పరిషత్ సిఇఒ డి.సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

కాఫీ తోటలకు గతంలో మాదిరి రూ.48 వేలు ఇవ్వాలి

- సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ఉపాధి హామీ చట్టం నిధుల్లో కాఫీ తోటలకు గతంలో మాదిరి రూ.48 వేలు ఇవ్వాలని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు డిమాండ్ చేశారు. జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా ఆయన రెండు, నాలుగు స్థాయీ సంఘాల సమావేశాల్లో మాట్లాడుతూ కాఫీ తోటల పెంపకానికి ఉపాధి హామీ నిధులు ఇవ్వకపోవడం, వాణిజ్య పంటలకు నిధులను ప్రాధాన్యతారీతిలో కేటాయింపు చేయకపోవడం వంటి కారణాలతో యువత గంజాయి పెంపకం వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. దీనిని నివారించాలంటే ఉపాధి నిధులు కాఫీ తోటల పెంపకానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెక్నికల్ సమస్యలు చెప్పి సామాజిక పింఛన్లు నిలిపివేయడం తగదన్నారు. కాఫీ తోటలకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో ఉపాధి హామీ చట్టంలో ఉన్న ఆ నిధులను 2020లో తొలగించారన్నారు. నాడు ఒక ఎకరం కాఫీ తోటకు రూ.48 వేలును విడతల వారీగా రైతులకు చెల్లించిన విషయాన్ని గుర్తుచేశారు. కాఫీ తోటలకు ఉపాధి హామీ చట్టం లింకును ఎత్తివేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. విశాఖపట్నం కెజిహెచ్‌లో రోగుల నుంచి కిందిస్థాయి ఉద్యోగులు, డ్రైవర్లు లంచం అడగడం మానుకోవాలని తెలిపారు. అనంతగిరి మండలం, ఇతర ప్రాంతాల నుంచి, విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అత్యవసర కేసులను కెజిహెచ్‌కు తరలించకుండా విజయనగరం రిఫర్ చేస్తున్నారన్నారు. 108 అంబులెన్స్ ద్వారా కెజిహెచ్‌కు రిఫర్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

- రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి- దేవీపట్నం

ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఒకటో తరగతి నుండే వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ఉపాధ్యాయులను ఆదేశించారు. దేవీపట్నం మండలం పెద్ద భీంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను శనివారం పిఒ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఏవిధంగా పాఠాలు బోధిస్తున్నదీ, పాఠాలు అర్థమవుతున్నదీ లేనిది ఆరా తీశారు. ఇప్పటివరకు టైం టేబుల్ ప్రకారం ప్రతిరోజు ఏయే పాఠాలు చెప్పారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ పుస్తకాలు, బట్టలు అందజేసిందీ లేనిది, మధ్యాహ్న భోజన పథకం ఏవిధంగా అమలు చేస్తున్నదీ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారం మధ్యాహ్నం భోజనం పథకం మెనూ అమలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలలో దోమలు ప్రబలకుండా పనికిరాని మొక్కలు తొలగించాలని సూచించారు.

పాఠశాలను సందర్శించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి- కొయ్యూరు

మండలంలోని రావణాపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు కాసేపు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం అక్కడే ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్, విద్యార్థులతో కలిసి ఐటిడిఎ పిఒ భోజనం చేశారు.



పాఠశాలలో భోజనం చేస్తున్న పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్

విశ్వేశ్వరరాజుకు అభినందనలు

ప్రజాశక్తి – చింతపల్లి : ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా పాడేరు శాసనసభ్యుడు మత్యరాస విశ్వేశ్వర రాజు నియమితులు కావడం హర్షనీయమని వైకాపా ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జెల్లీ సుధాకర్ అన్నారు. ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన విశ్వేశ్వర రాజును ఆ పార్టీ నాయకులు కూడా సురేష్ కుమార్, సోషల్ మీడియా ఇన్చార్జ్ కూడా సుబ్రహ్మణ్యం లతో కలిసి పాడేరు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,పార్టీ బలోపేతం కోసం పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుంది అనడానికి ఉదాహరణ మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకొని విశ్వేశ్వర రాజు నిలబడ్డారన్నారు. ఇచ్చిన హామీ మేరకు 2024లో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారన్నారు. సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించిన విశ్వేశ్వర రాజుకు పార్టీ అధికారంలోకి రాకపోయినప్పటికీ, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించి మన్య ప్రాంతంలో ఎస్సీ సెల్ బలోపేతానికి మరింత అవకాశం కల్పించారన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన విశ్వేశ్వరరాజు తెలిపారు.



అభినందనలు తెలుపుతున్న వైసిపి నాయకులు



-నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు

సమస్యలను పరిష్కరించాలని

ఆసుపత్రి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యలు పరిష్కారం చేయాలని పాడేరు జిజిహెచ్ ఆసుపత్రి వివిధ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శనివారం మధ్యాహ్నం ఆస్పత్రి వద్ద నిరసన నిర్వహించారు. ఈ మేరకు సమ్మె నోటీసును ఆసుపత్రి సూపరిండెంట్ విశ్వ మిత్ర కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఏఐటీయూసీ నాయకులు సుందరరావు, జల్లి రాజబాబు, అమర్ మాట్లాడుతూ, గత ఆరు నెలల నుంచి రావలసిన జీతం బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, అనేక మార్లు వివిధ స్థాయిలో ఉన్నటువంటి ఉన్నత అధికారులకు తెలియజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగుల సమస్యలపై అధికారులతో చర్చించగా సమస్య పరిష్కరిద్దామని చెపుతూనే దాటవేత దొరనితో మాట్లాడుతున్నారన్నారు. జీతాలు పడకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ ఆత్మహత్యాయత్నం చేసుకోవడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి అన్ని విభాగలలో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలు చెల్లించాలన్నారు. వివిధ విభాగలలో ఖాళీగా ఉన్న సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. వచ్చేనెల 7- నుండి అన్ని విభాగలలో ఉన్నటువంటి ఉద్యోగులతో కలిసి సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్రమములో యూనియన్ నాయకులు అనంత్, ఎలీషా, సరోజిని, అన్నపూర్ణ, స్వామి, రాంబాబు, భవాని, రాజు, చంటి, శ్రీను, రాజు, సూరిబాబు పాల్గొన్నారు.

అత్తింటివారి వేధింపులతోనే

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి – చింతపల్లి : భర్త, అత్తమామలతో పాటు ఆడపడుచు వేధింపులు తాళలేక కర్రి భారతి ఆత్మహత్యకు పాల్పడిందని స్థానిక ఎస్సై అరుణ్ కిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక నెయ్యిల వీధిలో నివాసం ఉంటున్న కర్రీ భారతి ఆత్మహత్యకు పాల్పడిన విషయం పాఠకులకు విధితమే. ఈ ఘటనపై భారతి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు ను వేగవంతం చేయగా భర్త, అత్తమామలతో పాటు ఆడపడుచుల వేధింపుల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలిందన్నారు. ఆత్మహత్యకు కారకులైన భర్త మణికంత, అత్తమామలు వెంకటేష్, అచ్చమ్మ, ఆడపడుచు విప్పుల వరలక్ష్మి లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితులతో పోలీసులు

పోలవరం నిర్వాసితులకు

ఎన్యుమరేషన్ చేసి పరిహారం చెల్లించాలి

- మెరుగైన ప్యాకేజీ, పునరావాసం కల్పించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నష్టపోతున్న నిర్వాసిత ప్రజానీకానికి కచ్చితమైన ఎన్యుమరేషన్ చేసి పరిహారాన్ని తక్షణమే చెల్లించాలని, నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రంపేటలో సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ వరదల కాలంలో ముంపునకు గురైన ప్రజల నివాసాలు, పంట పొలాలు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రాజెక్ట్ నిర్మాణం సాంకేతిక కారణాల రీత్యా ముంపు అధికంగా లేకుండా చూడాలన్నారు. కాపర్ డ్యాం నిర్మాణంతో బ్యాక్ వాటర్ కారణంగా ప్రతి ఏటా చిన్నపాటి వరదలకే నాలుగు మండలాల్లో ముంపు అధికంగా ఉంటుందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 45.72 మీటర్లు ఎత్తు కడితే రాష్ట్రంలో ముంపు ప్రాంతం విపరీతంగా పెరిగిపోవడంతో పాటు పొరుగు రాష్ట్రాలతో సమస్యలు ఉత్పన్నమవుతాయని, 41.15 మీటర్లు దిగువ స్థాయికి కడితే ఈ ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించడానికి పోలవరం కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని మరింత పెంచి వెడల్పు చేసి, గోదావరిలో వరదలు ఉన్నప్పుడు అధిక నీటిని తీసుకొనేలా ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని నిపుణులు చెబుతున్నా, ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని విమర్శించారు. 45.72 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టును నిర్మిస్తే భూగర్భంలో పెద్ద మార్పులు జరిగి దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు నిర్వాసితులకు ముప్పు ఏర్పడుతుందన్నారు. రానున్న కాలంలో సిపిఎంను బలోపేతం చేసి ప్రజల దీర్ఘకాలిక, స్థానిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొలుత పార్టీ జెండాను సిపిఎం సీనియర్ నాయకులు మేకల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఇటీవల అమరులైన పలువురు సిపిఎం నాయకులకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్, మండల కార్యదర్శులు సీసం సురేష్, ఐవి, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం, చిత్రంలో జిల్లా కార్యదర్శి కిరణ్ తదితరులు

బిక్కుబిక్కుమంటూ విద్యాభ్యాసం

- శిథిలావస్థకు చేరిన చెక్కలమద్ది పాఠశాల భవనం
- ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయితీ చెక్కలమద్ది గ్రామంలో ఎంపీపీ పాఠశాల భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గోడలు బీటలు వారాయి. స్లాబ్ పూర్తిగా శిథిలమై వర్షం పడితే పాఠశాల లోపల పూర్తిగా కారిపోతుంది. దీంతో విద్యార్థులు విద్యను అభ్యసించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకొని మరమ్మతులకు గురి కావడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయులు సైతం భయం భయంతో విద్యా బోధన చేస్తున్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టవలసిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయంగా వేరే భవనంలో తరగతులు నిర్వహించాలని, నూతనంగా భవనం మంజూరు చేసి తక్షణమే నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో సిసి రోడ్లు, పంట కాలువ, చెక్ డ్యామ్ మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



గోడలు, భవనం శిథిలమైన చెక్కలమద్ది ఎంపీపీ పాఠశాల ఇదే..



రోడ్డుపై నిలిచిన లారీ

రోడ్డుకడ్డంగా నిలిచిన లారీ

-వాహన రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని కించుమండ సంత బయలులో నూతనంగా నిర్మిస్తున్న 516 ఈ హైవే రోడ్డుకు మధ్యన లారీ నిలిచి పోవడంతో వాహన రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈనెల 23 న శుక్రవారం తెల్లవారుజామున లారీ మరమ్మతు గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. రెండు రోజులుగా రోడ్డుకు అడ్డంగా వాహనం నిలిచి పోయినా బయటికి తీయకపోవడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అల్లూరి జిల్లా పాడేరు కేంద్రానికి, అరకుకు ప్రధాన రోడ్డు ఇది కావడంతో ఈ రోడ్డు గుండా నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. రోడ్డుకు అడ్డంగా వాహనం నిలిచిన వెంటనే దానిని బయటికి తీసి పక్కు పెట్టడంలో నిర్లక్ష్యం చేయడం కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.



సిఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ పాత్రికేయులు

గంజాయిపై ఉక్కు పాదం

ప్రజాశక్తి- అరకులోయ : గంజాయిని సమూలంగా నిర్మూలించాలని అరకులోయ నూతన సీఐ ఎల్.హిమగిరి అన్నారు. కొత్తగా అరకులోయ సిఐ గా బాధ్యతలు చేపట్టిన ఆయనను తన కార్యాలయంలో కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ, అరకులోయ పోలీస్ సర్కిల్ ఆంధ్ర ఒడిస్సా బోర్డర్ కు ఆనుకొని ఉందని అంతర్ రాష్ట్ర ఒడిస్సా ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా దృష్టి సాధించనున్నట్లు ఆయన అన్నారు. యువత, యువతీ, విద్యార్థిని, విద్యార్థులు సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన అన్నారు. గంజాయితో జరిగే నష్టాలపై పాఠశాలల్లో,కళాశాలల్లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అరకులోయ పర్యాటక కేంద్రం కావడంతో దేశ విదేశాల నుంచి ఇక్కడికి అనేకమంది సందర్శకులు వచ్చిపోతుంటారని ఇటువంటి నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఉన్నత విద్యామండలి సదస్సులో ఎయు అధికారులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉన్నత విద్యామండలి వర్చువల్ విధానంలో నిర్వహించిన సదస్సులో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పాల్గొన్నారు. డిగ్రీ కోర్సుల డిజిటలైజేషన్, డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ తదితర అంశాలపై ఉన్నత విద్యమండలి ఇంచార్జి చైర్మన్ ఆచార్య కె.రామమోహనరావు చర్చించారు. సదస్సులో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, కంప్యూటర్ సెంటర్ డీన్ ఆచార్య భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెల్లరాయి క్వారీపై ఆందోళన

ప్రజాశక్తి - చింతపల్లి : తెల్లరాయి క్వారీతో తమ బతుకులు తెల్లారిపోతున్నాయని తెరపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లరాయి గ్రానైట్ క్వారి తవ్వకాలతో ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూచ తెల్ల రాయి గ్రానైట్ క్వారీ తవ్వకాల కారణంగా తమ గృహాలు బీటలు బారడమే గాక, తాగునీటి జలాలు కలుషితమై అంతుబట్టని వ్యాధులు ప్రబలుతున్నాయని, ఇందులో భాగంగా అనేకమంది పక్షవాతానికి గురైన సందర్భాలు ఉన్నాయన్నారు. కలుషిత నీటితో అనేకమంది మలేరియా, డయేరియా, ఇతర నీటి సంబంధ వ్యాధుల బారిన పడి ఇబ్బంది పడుతున్నారన్నారు. రక్షిత తాగునీటిని కల్పించమని అడుగుతున్నా గిరిజనుల గోడు పట్టించుకోని ప్రభుత్వాలు ఐదవ షెడ్యూల్ ఏరియాలో గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఎలా ఇచ్చారో అర్థం కావలేదన్నారు. ఈ క్వారీతో ఇప్పటివరకు ఎంతోమంది మృత్యువాత పడ్డారన్నారు. తాగునీటి వనరులు కలుషిత కావడమే గాక, క్వారీ తవ్వకాలతో వచ్చే మట్టి వరుసపు నీటితో పంట పొలాలను ముంచెత్తి పంటలను నాశనం చేస్తుందని, ప్రతి ఏటా ఇదే విధంగా జరుగుతున్నా , సమస్య పరిష్కారానికి క్వారీ యాజమాన్యం ఇటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు అడిగినా క్వారీ నిర్వాహకులు తమ గోడు వినడం లేదన్నారు. నష్టపరిహారాన్ని సైతం నాలుగేళ్లుగా చెల్లించలేదన్నారు. క్వారీ వద్ద ఉన్న ఉద్యోగుల నుంచి సరైన సమాధానం



మాట్లాడుతున్న నాయకులు

రాకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఒక దశలో క్వారీ కి సంబంధించిన భవనాలకు తాళాలు వేసేందుకు సైతం సిద్ధపడ్డారు. ఈ దశలో అక్కడికి చేరుకున్న జనసైనికులు ఉల్లి సీతారాం, వంతల బుజ్జిబాబు, కిముడు కష్ణమూర్తి (పండు) లు క్వారీ నిర్వాహకులతో చర్చలు జరిపారు. సమస్యల పరష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమయపాలన ఏదీ?

11 గంటలు దాటుతున్నా హాజరు కాని సచివాలయం సిబ్బంది



తెరవని ఎన్ఆర్ పురం సచివాలయం

ప్రజాశక్తి -అనంతగిరి

ప్రజా పాలన అందించడంలో సచివాలయ వ్యవస్థ గాడి తప్పింది. ప్రభుత్వ పదకాలు ప్రజలకు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసింది. ఎన్ఆర్ పురం, కాశీపట్నం, చిలకగెడ్డ సచివాలయం శనివారం 11 గంటలకు కూడా తెరవకపోవడం గమనార్హం. సిబ్బంది లేకపోవడంతో వెనుతిరగ వలసిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభలను కూడా సిబ్బంది హాజరు కాకపోవడం స్థానిక సర్పంచ్ లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నత అధికారులు పర్యవేక్షణ లోపంతోనే సిబ్బంది విధుల డుమ్మా కొడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. బయోమెట్రిక్ పద్ధతి ఉన్నప్పటికీ కూడా విధులకు గైర్హాజరవుతున్నారు.

దీనిపై డిఎల్‌పిఒ, పంచాయతీ విస్తరణ అధికారి కుమార్‌ను వివరణ కోరగా సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రతిరోజు కార్యాలయంలో హాజరై అనంతరం గ్రామాలలో సందర్శించాలన్నారు.

'ఆ హబ్‌పై అసత్య ప్రచారాలను నమ్మొద్దు'

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటై అతితక్కువ కాలంలో దేశంలోని ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రాలకు ధీటుగా అత్యుత్తమ ప్రగతి సాధిస్తున్న ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్ (ఆ హబ్)పై కొంతమంది ఉద్దేశపూర్వకంగా అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, వీటిని ఎంతమాత్రం విశ్వసించవద్దని ఆ హబ్ సిఇఒ రవి ఈశ్వరపు తెలిపారు. ఆ హబ్ కేంద్రంగా పనిచేస్తున్న స్టార్టప్ సంస్థలను ఖాళీ చేసి వెళ్లాలని చెప్పినట్లుగా కొంతమంది ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో ఈ వివరణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇటువంటి నిరాధార, అసత్య ఆరోపణలను విశ్వసించవద్దని సూచించారు. ఏయూ ఆ హబ్ నుంచి ఎవ్వరిని వెళ్లమని తాము చెప్పలేదని పేర్కొన్నారు.

తాను ఆంధ్రవిశ్వవిద్యాలయం పాలకులతో సమన్వయం చేస్తూ దేశంలోని అతిపెద్ద మల్టీడిసిప్లినరీ ఇంక్యుబేషన్ ఎకోసిస్టంగా ఆ హబ్‌ను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. టెక్ ఇంక్యుబేషన్‌తో పాటు బయోటెక్, ఫార్మా, మెరైన్, ఫుడ్, జీనోమిక్స్, ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, విమెన్, గ్రామీణ తదితర రంగాలలో స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఇంక్యుబేషన్ రంగంలో అత్యుత్తమ స్థానాన్ని ఆ హబ్ సాధించిందని తెలిపారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు కలిగివున్న అతిపెద్ద ఇంక్యుబేషన్ వ్యవస్థల్లో ఒకటిగా ఆ హబ్ ఉందన్నారు. ఆ హబ్ తన సేవలను మారిషన్, శ్రీలంకలో ప్రారంభించిందని, త్వరలో హైదరాబాద్‌లో సైతం సేవలను ప్రారంభిస్తుందని తెలిపారు. ఏయూ ఇంక్యుబేషన్ కేంద్రం రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో, నూతన ఆవిష్కరణలు జరపడం, సంస్థలను స్థాపించడంలో, జిడిపి వృద్ధికి ఎంతో దోహదపడుతోందని పేర్కొన్నారు.

ఎయులో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విద్యా విభాగం ఆచార్యులు, విద్యార్థులు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపును స్వీకరిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సైతం స్వచ్ఛభారత్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ విభాగాలలో నిర్వహించాలని ఆదేశించారు. దీనిలో భాగంగా విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు ఆధ్వర్యాన విద్యార్థులు, ఆచార్యులు ఆర్ట్స్ కళాశాల పరిసరాలలో వ్యర్థాలను ఏరివేశారు. అనంతరం ప్రాంగణాన్ని శుభ్రంచేశారు. ఈ సందర్భంగా ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛభారత్‌ను నిరంతర ప్రక్రియగా చేపడతామన్నారు. త్వరలో మెక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలీ, డాక్టర్ సాల్మన్‌రాజు, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ మూర్తి, విభాగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులతో ఎంపీ సమీక్ష

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శనివారం విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి రైల్వేకు సంబంధించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం విశాఖపట్నం పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులు, రైల్వే లైన్ల అభివృద్ధి, కొత్త రైళ్ల ప్రతిపాదనలు తదితర ముఖ్యమైన అంశాలపై చర్చించారు. అమృత్ భారత్ స్కీం కింద విశాఖపట్నం, సింహాచలం, కొత్తవలస స్టేషన్లకు మంజూరైన నిధులు, వాటి పనుల పురోగతిని సమీక్షించిన ఎమ్.శ్రీభరత్ ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ రవాణా మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని పోర్టులు, స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమలు రైల్వే మార్గాల ద్వారా భారీగా రవాణా చేస్తున్న నేపథ్యంలో ప్రత్యేక లైన్ల ఏర్పాటుకు, రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన వివరాలను అధికారులతో చర్చించారు. దువ్వాడ స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాప్ ఇవ్వాలనే ప్రతిపాదనను కూడా అధికారుల ముందుంచారు.

విశాఖపట్నం-బెంగళూరు మధ్య ప్రత్యేక రైలును వారంలో మూడు రోజులు నడపాలని, వివిధ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు వీలైనంత త్వరగా ఈ సర్వీసును ప్రారంభించాలని కోరారు. ఇది రెండు నగరాల మధ్య రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడమే కాకుండా, ఆర్థిక, వ్యాపార సంబంధాలను కూడా బలపరుస్తుందని ఎంపీ పేర్కొన్నారు.

విశాఖపట్నం రైల్వే జోన్‌పై పలు అంశాలను చర్చించారు. రైల్వే జోన్‌కు సంబంధించిన పనులు, కేటాయించిన నిధులు, భూమి కేటాయింపు తదితర విషయాలను సమీక్షించారు. రానున్న రోజుల్లో జోన్ అభివృద్ధి పనుల పురోగతిపై మరింత స్పష్టత ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

గాజువాకలో రైల్వే కు సంబంధించిన పనుల గురించి చర్చించారు. తుంగ్లాం భూ సమస్య, వడ్లపూడి వద్ద రైల్వే డ్రెయినేజీ సమస్య, సింహాచలం, మర్రిపాలెం, గోపాలపట్నం, కంచరపాలెం ప్రాంతాల్లో రైల్వేకు సంబంధించిన పలు అంశాలను కూడా సమావేశంలో చర్చించారు. సమీక్షా సమావేశంలో గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం పార్లమెంటరీ అధ్యక్షులు గండి బాబ్జి, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, డివిజన్ రీజినల్ మేనేజర్ సౌరభ్‌ప్రసాద్, డివిజనల్ ఇంజినీర్ జగదీశ్వరరావు, డివిజన్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్, ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి సునీల్ పాల్గొన్నారు.



రైల్వే అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీ శ్రీభరత్

27న సిఆర్‌టిలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలు, జిపిఎస్ పాఠశాలల్లో సిఆర్‌టిలుగా పనిచేస్తున్న అర్హత కలిగిన సిఆర్‌టిలకు ఈ నెల 27న ఇంటర్వ్యూలు, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పథక నిర్వహణాధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో 27న ఉదయం 8 గంటలకు హాజరు కావాలని కోరారు.

పల్సర్ బైక్ అపహరణ

ప్రజాశక్తి - సీలేరు : జివి.వీధి మండలం సీలేరులో శుక్రవారం రాత్రి పల్సర్ ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం... సీలేరు పంచాయతీ పరిధి అల్లూరి వీధి చివర్లో నివాసముంటున్న డి.మారేష్ తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు శుక్రవారం రాత్రి రోజులాగే పార్కు చేసి హ్యాండ్ లాక్ వేశారు. దొంగలు చాకచక్యంగా పల్సర్ బైక్ హ్యాండ్ లాక్ తీసి అపహరించకపోయారు. శనివారం ఉదయం మారేష్ నిద్ర లేచి చూసేసరికి ఇంటి ముందు పల్సర్ బైక్ కనిపించలేదు. దీతంఓ తన స్నేహితుల సహాయంతో సీలేరు పరిసరాలతో పాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు చిత్రకొండ, జాన్‌బై, పసుపులంక తదితర ప్రదేశాల్లో బైకు ఆచూకీ కోసం గాలించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినా బైక్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితుడు మారేష్ శనివారం ఫిర్యాదు చేశారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుగా చిరంజీవి

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు మండల ఇన్‌ఛార్జి తహశీల్దారుగా ఎస్.చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహశీల్దారు బదిలీ కావడంతో ఆర్‌డిఒ కార్యాలయంలో పని చేస్తున్న చిరంజీవిని తాత్కాలికంగా మండల ఇన్‌ఛార్జి తహశీల్దారుగా ఉన్నతాధికారులు నియమించారు.

కూనవరం రేంజ్ ఆఫీసర్‌ను బదిలీ చేయాలని వినతి

ప్రజాశక్తి - చింతూరు : దీర్ఘకాలంగా పని చేస్తున్న కూనవరం రేంజ్ ఆఫీసర్‌ను వెంటనే బదిలీ చేయాలని టిడిపి కూటమి నాయకులు శనివారం చింతూరు డిఎఫ్ఒకు వినతి పత్రం అందించారు. రేంజ్ ఆఫీసర్ గిరిజనులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని అందులో పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాయం వెంకయ్య, రమణారెడ్డి, ఇల్లా చిన్నారెడ్డి, యస్‌డి.అసిఫ్, మడివి రాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు చక్రాల స్కూటీ మంజూరు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని శరభన్నపాలెం గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు వనగల వెంకటేశ్వర్లు తనకు మూడు చక్రాల స్కూటీ మంజూరు చేయాలని పబ్లిక్ గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేయగా, వెంటనే స్పందించిన పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్కూటీని మంజూరు చేశారు. లక్షా 13వేల రూపాయల విలువైన మూడు చక్రాల స్కూటీని శనివారం కొయ్యూరు ఎంపీడీవో కార్యాలయంలో వెంకటేశ్వర్లుకు పిఒ అభిషేక్ అందజేశారు. దీంతో లబ్ధిదారుడు ఐటీడీఏ పీవోకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అపోలో నుంచి రూ.21.60 లక్షల నష్ట పరిహారం సాధించాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రోగికి నిర్లక్ష్యంగా వైద్యం చేసినందుకుగాను విశాఖపట్నం అపోలో ఆసుపత్రిపై రూ.21.60 లక్షల నష్ట పరిహారం సాధించామని సుప్రీంకోర్టు న్యాయవాది, అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా) వ్యవస్థాపకులు అబీబ్ సుల్తాన్ అలీ తెలిపారు. అపోలోలో వైద్యుల నిర్లక్ష్యంపై శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య రంగం నిర్లక్ష్యం మీద ఒక వినియోగదారుడు సాధించిన గొప్ప విజయంగా తాజా ఘటనను ఉదహరించారు. ఆశ్రా సంస్థ దేశంలోనే అతి పెద్ద వినియోగదారుల పరిరక్షణ సంస్థ అని పేర్కొన్నారు. తాము అపోలో ఆసుపత్రి నుంచి రూ.21.60 లక్షల నష్ట పరిహారం ఎలా సాధించినదీ వివరించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు పెరగాలన్నారు. సమావేశంలో ఆశ్రా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది తోట శత్రుఘ్నుడు. సభ్యులు మహ్మద్ ఇక్బాల్జీ, కిషోర్ కుమార్, ఎమ్‌డి నజ్జీమ్, జి.శ్యామలా దేవి, పి.హైమా, ఇ.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

26న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 26న శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ప్రభుత్వ సెలవు అయినందున జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ, అన్ని జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ తెలిపారు.

నిర్లక్ష్య కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోండి

'ఎసెన్షియా' ఫార్మా ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం
ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టండి
అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ - ఫార్మా ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - అనకాపల్లి

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదానికి పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరే కారణమని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మా ప్రమాదంలో గాయపడి అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పాండా, ఐఎఫ్‌టియు రాష్ట్ర సమితి సభ్యులు మల్లన్న తదితరులు శనివారం పరామర్శించారు. అనంతరం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య తీరుతో ఫార్మా కంపెనీల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫార్మా ప్రమాద బాధితుల విషయంలో కేవలం నష్టపరిహారం ప్రకటించి తప్పుకునే ప్రయత్నం చేశారన్నారు. కంపెనీలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం, గతంలో జరిగిన ప్రమాదాల తరువాతైనా గుణపాఠాలు నేర్వకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ప్రమాద కారణాల నివేదికలను ఇంతవరకు బయట పెట్టకపోవడం శోచనీయమన్నారు. తాజా ప్రమాదంపై ముఖ్యమంత్రి, హోంమంత్రి, పార్లమెంటు సభ్యులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీలు ఆధునిక జైళ్లుగా మారాయన్నారు. దేశంలోని ధనవంతుల్లో ఫార్మా కంపెనీల వారే ఎక్కువ మంది ఉన్నారు. దేశ, విదేశాల్లో వద్దన్న ఫార్మా కంపెనీలను ఇక్కడ నెలకొల్పుతుండడంతో ఇక్కడ ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. విషతుల్య రసాయన పరిశ్రమల వల్ల మత్స్యకారుల కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయన్నారు. తక్షణమే అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ ఆధీనంలో ఫార్మా కంపెనీలు ఉండాలని, జరిగిన ప్రమాదంపై తక్షణమే జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈ నెల 28న విజయవాడలోని కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కొండలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, ప్రజా సంఘాల నాయకులు ఎం.అప్పలరాజు, కె.త్రినాథ్, పెంటకోట సత్యనారాయణ, రాజు, ఫణీంద్ర పాల్గొన్నారు. అలాగే ఆసుపత్రిలో ఫార్మా ప్రమాద బాధితులను పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, ఎస్ఎఫ్ఐ నాయకులు చలపతి, తదితరులు ఉన్నారు.

అన్ని పరిశ్రమల్లో వారం రోజుల్లో సేఫ్టీ ఆడిట్

అధికారులకు విశాఖ కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మికులు, ఉద్యోగుల భద్రతకు, రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమలను నిర్వహించాలని, పని చేసే చోట వారికి అన్ని రకాల వసతులూ కల్పించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. వారం రోజుల్లోగా జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, లోటుపాట్లను గుర్తించి సరి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా అన్ని చోట్లా మాక్ డ్రిల్స్ కండక్ట్ చేయాలని, ప్రమాదాలపై కార్మికులకు, సమీప నివాసితులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి కంపెనీ పరిసరాల్లో అలారం సిస్టం తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన ఫార్మా ప్రమాద ఘటనల నేపథ్యంలో జిల్లాలోని 57 పరిశ్రమల నిర్వాహకులతో జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో పోలీస్ కమిషనర్, జాయింట్ కలెక్టర్, జివిఎంసి కమిషనర్, ఇతర అధికారులతో కలిసి శనివారం సాయంత్రం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు ప్రశాంత వాతావరణంలో.. ధైర్యంగా ఉద్యోగం చేసుకునేలా నిర్వాహకులు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పని చేసే చోట వారికి అన్ని రకాల వసతులూ కల్పించాలని, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స చేయడానికి కిట్లను అందుబాటులో ఉంచాలని, పారామెడికల్ సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. సేఫ్టీ ప్రోటోకాల్ పాటిస్తూ నైపుణ్యం కలిగిన ఒక ఇన్‌ఛార్జిని కూడా నియమించుకోవాలని సూచించారు. ప్రమాద ఘటనలు జరిగినప్పుడు సమాచార మార్పిడి, ప్రమాద నివారణ సూచనలను పంచుకోవడానికి వీలుగా ఒక పోర్టల్ క్రియేట్ చేస్తామని, అందరికీ లాగిన్ ఐడిలు ఇస్తామని తెలిపారు. జిల్లాలోని 57 పారిశ్రామిక యూనిట్లలో సంబంధిత విభాగాల అధికారులు తరచూ



మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

తనిఖీలు చేపట్టాలని, లోపాలుంటే తక్షణమే సరిదిద్దేలా యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని చెప్పారు. త్వరలోనే జాయింట్ తనిఖీ బృందాన్ని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో సిపి శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫక్కీరప్ప, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణపతి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పలువురు పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

మృతులకు సంతాపం ప్రకటించిన యంత్రాంగం

ఇటీవల జరిగిన ఫార్మా ఘటనలో 17 మంది చనిపోవడం విచారకరమని, వారి కుటుంబాల పరిస్థితి ఇప్పుడు దయనీయంగా ఉందని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి మృతికి సంతాపం ప్రకటిస్తూ ఈ క్రమంలో అధికారులంతా లేచి నిల్చొని రెండు నిమిషాలు మౌనం పాటించారు.



ఎగ్జిబిషన్‌లోని ఓ స్టాల్ వద్ద మహిళలు

ఆకట్టుకున్న సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశీ కళా ఆథెంటిక్ లూమ్ ఆధ్వర్యంలో వైజాగ్ బీచ్ రోడ్డులోని గేట్ వే హోటల్‌లో సిల్క్ ఇండియా హండ్లూమ్ వస్త్ర ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శన ఈ నెల 29 వరకు ఉదయం 10:30 నుండి రాత్రి 9:30 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు సతీష్ కుమార్ మాట్లాడుతూ కృష్ణాష్టమి, వినాయక చవితి వంటి పండగలు, వెడ్డింగ్ సీజన్ సందర్భంలో కొత్త కలెక్షన్స్, ఎక్కువ వెరైటీస్‌తో వైజాగ్ ప్రజల ముందుకు వచ్చామన్నారు. ఈ ప్రదర్శనలో చేనేత కళాకారుల నైపుణ్యం, నేతన్నల శ్రమ కనిపిస్తుందని అన్నారు. వంద శాతం ప్యూర్ సిల్క్, జాంధని, బెనారస్, బాగల్పూరి సిల్క్, లెనిన్ కాటన్, పోచంపల్లి, మైసూర్ సిల్క్, ధర్మవరం, డ్రెస్ మెటీరియల్స్, డ్రెస్సెస్ వంటి మరిన్ని రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సుమారు 20 రాష్ట్రాల నుంచి 50కిపైగా చేనేతకారులు పాల్గొన్నారన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని చేనేత కార్మికులను ప్రోత్సహించాలని కోరారు.

ఎవరి మెప్పు కోసం అధికారులపై వేధింపులు

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ అయోధ్యరామ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎవరి మెప్పు పొందడం కోసం ఉక్కు అధికారులపై వేధింపులకు పాల్పడుతున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రశ్నించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న ఇడి ఒఎస్ ఇన్‌ఛార్జిని మార్చారని తెలిపారు. ఆయనకు కనీసం రూము కూడా అలాట్ చేయకుండా వేధింపులకు దిగారని పేర్కొన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్‌లో పనిచేసే మరొక సిన్సియర్ అధికారి నాగ్‌ను, మరొక విభాగంలో పనిచేస్తున్న కెవి.రావును ఇష్టానుసారంగా బదిలీ చేశారని తెలిపారు. మరోపక్క 199 మంది ఇంజినీరింగ్ విభాగం ఇన్చార్జిలకు కాంట్రాక్టు లేబర్ అటెండెన్స్ లింకు పెట్టి రాత్రికి రాత్రి షోకాజ్ నోటీసులు అందజేశారన్నారు. ఇదంతా ఇక్కడ ఉన్న స్టీల్ సిఎమ్‌డి చేస్తున్నారా ? లేక ఢిల్లీలో ఉన్న మంత్రి ద్వారా ఆదేశాలు అందుతున్నాయా ? అన్నది తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్లాంట్‌లో ఉత్పత్తి, ముడి సరుకులు, ఉద్యోగుల జీతాలు లేక అలమటిస్తూ ఉంటే ప్లాంట్‌లో భయానక వాతావరణం సృష్టించి భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం ఎంత వరకూ సమంజసమన్నారు.

30న విశాఖకు రాజ్యసభ సభ్యుల బృందం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ఈ నెల 30న సాయంత్రం విశాఖ పోర్టుకు రాజ్యసభ సభ్యుల బృందం రానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లలో వైజాగ్ పోర్టు ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. 30న సాయంత్రం నోవటల్‌కు నేరుగా బృంద సభ్యులు చేరుకోనున్నారు. అక్కడ ఆ రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలను పోర్టు అధికారులు వీరి కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీ పిటిషన్స్‌ను స్వీకరించేందుకు విచ్చేస్తోంది.

31న పూర్తిస్థాయిలో కమిటీ సభ్యులు పర్యటించనున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్ఐఎన్ఎల్, హెచ్‌పిసిఎల్, షిప్‌యార్డు తదితర చోట్లకు వెళ్లే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అలాగే మెడ్ టెక్ జోన్‌కు కూడా బృంద సభ్యులు వెళ్లనున్నారు. ఈ కమిటీకి ఒడిశా బిజెడి ఎంపీ సుజిత్ కుమార్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయనతో కలిపి ఎనిమిది మంది పర్యటనలో పాల్గొనున్నారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ నుంచి ఇద్దరు సభ్యులు ఈ పిటిషన్స్ కమిటీలో ఉంటారు. వీరంతా ప్రజల నుంచి లేదంటే ప్రభుత్వ రంగ సంస్థలు, కీలకమైన మెడ్‌టెక్ వంటి సంస్థల నుంచి వివిధ ఫిర్యాదులను 31వ తేదీన స్వీకరించనున్నారు.